ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 1 ,(ప్రజాజ్యోతి) నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను అందజేయాలని తెలిపారు, ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు, కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 2 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

- 'ప్రజాజ్యోతి' పరిశోధనాత్మక కథనాలతో హడలెత్తిపోయిన అక్రమార్కులు!
- రూ. 50 లక్షల అడ్వాన్స్ సొమ్ము తిరిగి చెల్లించేందుకు ఒప్పందం?
- స్థానిక సీపీఎం నేత సమక్షంలో ముగిసిన రహస్య పంచాయితీ!
- రూ. 20 లక్షల నగదు వాపస్.. మిగతా మొత్తానికి 3 ఎకరాల పొలం అప్పగింత ఒప్పందం?
- పంచిపెట్టిన సొమ్ము వెనక్కి రాక సూత్రధారి అసహనం.. తీసుకున్నవారు ముఖం చాటేస్తున్నట్లు ప్రచారం!
- 'ప్రజాజ్యోతి'కి అసలు నిజాలు వెల్లడించే ఆలోచనలో ముఖ్య సూత్రధారి.. అప్రూవర్‌గా మారేందుకు సన్నాహాలు?
- పెద్దలంతా తమ సొమ్ములు సర్దుకున్నారు.. బాధిత గిరిజన రైతుకు జరిగిన నష్ట పరిహారమేది..?



డామిట్.. కథ అడ్డం తిరిగింది..!

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పరిధిలోని సుమారు 60 ఎకరాల భూమి వ్యవహారంలో కథ అడ్డం తిరిగినట్లు కనిపిస్తోంది. గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళి సాగు చేసిన జామాయిల్ తోటను ధ్వంసం చేసిన ఘటనపై 'ప్రజాజ్యోతి' దినపత్రిక వరుసగా వెలువరించిన పరిశోధనాత్మక కథనాలతో ఈ వ్యవహారంలోని అనేక అనుమానాస్పద కోణాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా 'భూకబ్జా స్కిప్ట్' పేరుతో ప్రచురించిన విశ్లేషణాత్మక కథనంలో, కౌలు రైతు సాగులో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని విక్రయించేందుకు వేసిన వ్యూహాన్ని, రెవెన్యూ నివేదికలను ఆధారాలతో ప్రజల ముందుంచడం జరిగింది.



వనమా వేడుకల్లో 'కూతుళ్ల' అసంతృప్తి!



మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు 82వ జన్మదినం, 50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ వేడుకలు

వేడుకల నిర్వహణకు లక్షలాది రూపాయల ఆర్థిక సహకారం అందించిన కుమార్తెలు, అల్లుళ్లు

- వందలాది ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఎక్కడా కనిపించని కుమార్తెల ఫొటోలు, పేర్లు
- భారీ సభలోనూ తగిన గుర్తింపు దక్కలేదని, వేదికపైకి ఆహ్వానించ లేదని ఆవేదన
- కుమారుడు రాఘవేంద్రరావు, మనవరాలు అలేఖ్య రాజకీయ పరిచయానికే ప్రాధాన్యత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, **నవంబర్ 01, ప్రజాజ్యోతి :** ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, ఎనిమిది పదుల జీవిత ప్రయాణం పూర్తి చేసుకున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు 82వ జన్మదినం, ఆయన పొలిటికల్ కెరీర్ 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలు పాల్వంచలో వేలాదిమంది సమక్షంలో అట్టహాసంగా ముగిశాయి. రంగురంగుల ఫ్లెక్సీలు,

మిగతా 2 లో...

కొత్తగూడెం రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు!

- అధికార పార్టీ నేతకు చెందిన మిల్లుగా నియోజకవర్గంలో జోరుగా చర్చ
- తనిఖీల్లో అక్రమాలు గుర్తింపు.. రూ.2 నుంచి 3 కోట్ల జరిమానా విధించే అవకాశం ఉందంటూ ప్రచారం
- త్రీటౌన్ పరిధిలోని రైస్ మిల్లుపై దాడులు జరిగినా బయటకు రాని వివరాలు
- రాజకీయ పలుకుబడితోనే అధికారులు వివరాలు వెల్లడించట్లేదా అని అనుమానాలు
- అక్రమాలపై పారదర్శకంగా స్పందించి పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని ప్రజల డిమాండ్



ఎ ఐ చిత్రం...

2 లో...

చాపల మార్కెట్ బస్తీలో మరణ మృదంగం

ప్రజాజ్యోతి కథనానికి స్పందన...! 2 లో..

- చివరకు కదిలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
- ఎమ్మెల్యే పాయం ఆదేశం.. బస్తీలో ఇంటింటికి కాంగ్రెస్ నాయకుల పర్యటన
- వారానికి ముగ్గురు బలి.. పట్టించుకోని మున్సిపాలిటీ.. రగిలిన జనం
- మాకు బొడ్డు రాయి కావాలి.. కీడు పోయేలా చేయండి.. బస్తీ వాసులు కాంగ్రెస్ కి వేడుకోలు
- ప్రజాజ్యోతి పత్రికకి కృతజ్ఞతలు.. మా గోడు విని పత్రికలో రాశారు.. యాజమాన్యంకు దండాలు



వనమా వేడుకల్లో 'కూతుళ్ల' అసంతృప్తి!

(మొదటి పేజీ తరువాయి...)

బ్యానర్లు, ఆర్భాటపు ఏర్పాట్లతో బయటకు ఈ సంబరాలు ఎంతో వైభవంగా కనిపించినప్పటికీ.. తెరవెనుక మాత్రం వనమా కుటుంబంలో తీవ్ర అసంతృప్తి, అంతర్గత కలహాలు బద్దలయ్యాయి. తండ్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు లక్షలాది రూపాయలు సమకూర్చి ఆర్థికంగా అండగా నిలిచిన కుమార్తెలు, అల్లుళ్లకు ఈ వేడుకలో కనీస గుర్తింపు కూడా దక్కకపోవడం ఇప్పుడు జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

లక్షల ఖర్చు చేసినా దక్కని ప్రాధాన్యత!

వనమా ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకోవాలని కుటుంబ సభ్యులు నిర్ణయించిన క్రమంలో.. ఏర్పాట్లు, జనసమీకరణఖర్చులభారాన్ని ఇద్దరు కుమారులు, ఇద్దరు కుతుర్లె భరించారు. ఇందులో తండ్రి వేడుక అత్యంత వైభవంగా జరగాలనే ఉద్దేశంతో కుమార్తెలు, అల్లుళ్లు లక్షలాది రూపాయల మేర ఆర్థిక సహకారాన్ని అందించారు. కానీ నియోజకవర్గ వ్యాప్తంగా వెలిసిన వందలాది ఫ్లెక్సీలు, బ్యానర్లలో పలువురు నాయకులు, అభిమానుల ఫొటోలు కనిపించినప్పటికీ, నిధులు సమకూర్చిన కుమార్తెలు, అల్లుళ్ల ఫొటోలు గానీ, కనీసం వారి పేర్లు గానీ ప్రచారంలో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

వేదికపై ఆహ్వానం లేక బద్దలైన ఆవేదన!

దీనికితోడు సభా వేదికపై జరిగిన పరిణామాలు ఈ అంతర్గత అసమ్మతికి మరింత ఆజ్యం పోశాయి. కార్యక్రమంలో వనమా చిన్న కుమారుడు వనమా రాఘవేంద్రరావు, ఆయన కుమార్తె అలేఖ్యకే సభా వేదికపై ఆద్యంతం ప్రత్యేక ప్రాధాన్యతకల్పించారు. అదే సమయంలో తండ్రి వేడుక కోసం ఆర్థికంగా సహకరించిన ఇతర కుమార్తెలు, అల్లుళ్లను వేదికపైకి పిలవడానికి కూడా నిర్వాహకులు మనస్కరించలేదు. దీంతో తీవ్ర అవమానానికి గురైన కుమార్తెలు, అల్లుళ్లు తమకు అత్యంత సన్నిహితంగా ఉండే కొందరితో ఫోన్లలో మాట్లాడుతూ, మరికొందరితో నేరుగా సమావేశమై గంటల తరబడి తమ ఆవేదనను వెళ్లగక్కుకున్నారు. అవసరమైనప్పుడు నిధులు తీసుకుని, తీరా సభలో కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై వారు తీవ్రంగా వాపోయారు.

అలేఖ్య పొలిటికల్ రీ-లాంచింగ్‌పై పొలిటికల్ రచ్చ!

ఇదే సమయంలో వనమా రాఘవేంద్రరావు తన కుమార్తె అలేఖ్యను భవిష్యత్తులో కొత్తగూడెం రాజకీయాల్లో క్రియాశీలం చేయాలనే లక్ష్యంతో తాత 50 ఏళ్ల రాజకీయ వేదికను ఆమెకు 'పొలిటికల్ రీ-లాంచింగ్' ప్లాట్‌ఫామ్‌గా వాడుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అలేఖ్యకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన అదే వేదుకలో, ఆర్థికంగా అండగా నిలిచిన సొంత కుమార్తెలు, అల్లుళ్లకు కనీస గౌరవం దక్కకపోవడం జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. బయటకు ఆర్భాటంగా సాగిన ఈ సంబరాల వెనుక రాజుకున్న అసమ్మతి ముమ్మందు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని స్థానిక నాయకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

కొత్తగూడెం రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 01, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోనిత్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించడం కలకలం రేపుతోంది. ఈ మిల్లు అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేతకు సంబంధించిందనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. తనిఖీల్లో పలు అక్రమాలను గుర్తించిన అధికారులు, మిల్లు యాజమాన్యానికి దాదాపు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. అయితే, దాడులు జరిగి అక్రమాలు గుర్తించినప్పటికీ అధికారులు ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఆ మిల్లులో ఏం జరిగింది, అధికారులు ఎలాంటి లోపాలను గుర్తించారనే విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అసలు ఏ మిల్లుపై తనిఖీలు జరిగాయి, దాని యాజమాన్యం ఎవరిదనే వివరాలను సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీనేత పేరు ప్రచారంలోకిరావడంతో అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో ఎక్కడైనా రైస్ మిల్లులపై దాడులు జరిగినప్పుడు అక్రమార్కుల వివరాలను వెంటనే బయటపెట్టే అధికారులు, కొత్తగూడెం విషయంలో గోప్యత పాటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా పంపిణీకి సంబంధించిన ధాన్యం, బియ్యం వ్యవహారాల్లో పారదర్శకత ఉండాలని, తనిఖీల వివరాలు, విధించనున్న జరిమానాలపై అధికారులు వెంటనే ప్రకటన విడుదల చేసి చట్టం అందరికీ సమానమేనని నిరూపించాలని స్థానికులు కోరుతున్నారు.

చాపల మార్కెట్ బస్తీలో మరణ మృదంగం

ప్రజాజ్యోతి కథనానికి స్పందన...!



- చివరకు కదిలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
- ఎమ్మెల్యే పాయం ఆదేశం.. బస్తీలో ఇంటింటికి కాంగ్రెస్ నాయకుల పర్యటన
- వారానికి ముగ్గురు బలి.. పట్టించుకోని మున్సిపాలిటీ.. రగిలిన జనం
- మాకు బొడ్డు రాయి కావాలి.. కీడు పోయేలా చేయండి.. బస్తీ వాసులు కాంగ్రెస్ కి వేడుకోలు
- ప్రజాజ్యోతి పత్రికకి కృతజ్ఞతలు.. మా గోడు విని పత్రికలో రాశారు.. యాజమాన్యంకు దండాలు

ప్రజాజ్యోతి అక్షరం గెలిచింది.. చాపలమార్కెట్ బస్తీ గోడును గత రెండు రోజులుగా వరుస కథనాలతో వెలుగులోకి తేవడంతో, అధికార పార్టీలో చలనం మొదలైంది. పిట్టల్లా రాలిపోతున్న ప్రాణాలను చూసి కూడా కళ్లు మూసుకున్న యంత్రాంగం, ప్రజాజ్యోతి కథనంతో కళ్లు తెరుచుకున్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఢిల్లీ పర్యటనలో ఉన్నా సరే స్పందించి, తన మండల శ్రేణులను హుటాహుటిన బస్తీకి పంపించారు. మున్సిపాలిటీ నిర్లక్ష్యం, చెత్త డంప్, మురుగు కాలువల దుర్గంధంతో నరకం చూస్తున్న బస్తీలోకి కాంగ్రెస్ దళం అడుగుపెట్టింది. వారానికి ముగ్గురి చొప్పున చనిపోతున్నారని తెలిసి నాయకులే విస్తుపోయారు. మా బతుకులకు బొడ్డు రాయే దిక్కని బస్తీ జనం నాయకులను వేడుకున్నారు. దీంతో తక్షణమే మెడికల్ క్యాంపు, పారిశుద్ధ్య పనులు చేపడతామని బొడ్డు రాయి విషయం కూడా ఎమ్మెల్యేకి తెలియజేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. అక్టోబర్ 1, (ప్రజాజ్యోతి) : గత రెండు రోజులుగా ప్రజాజ్యోతి పత్రికలో "చాపల మార్కెట్ వాసులు పిట్టల్లా రాలుతున్నారు"అనేకథనానికిస్పందనలభించింది. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించారు.ఢిల్లీలో అత్యవసర కార్యక్రమంలో ఉన్నందున ఎమ్మెల్యే రాలేకపోయినా, వెంటనే స్థానిక మండల అధ్యక్షులు పిరానాకి నవీన్ ను బస్తీకి పంపించారు. నవీన్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు బస్తీలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. తమ బస్తీలో కాలువలు ఎప్పుడూ శుభ్రం చేయడం లేదని, చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. మున్సిపాలిటీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బస్తీలో వారానికి ముగ్గురు,నలుగురు చొప్పున అకాల మరణాలు సంభవిస్తున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. తమ బస్తీకి ఏదో కీడు సోకిందని, ఆ కీడు పోవాలంటే బొడ్డు రాయి వేయాలని ఎప్పటినుంచో కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నాయకులకు మొరపెట్టుకున్నారు. బస్తీని శుభ్రంగా ఉంచి, తమ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. స్థానికుల మాటలు విన్న మండల అధ్యక్షులు నవీన్, ఇటీవల చనిపోయిన కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే పాయం ఢిల్లీ నుంచి రాగానే బస్తీలో రోడ్ షో నిర్వహించి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా బస్తీలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తామని భరోసా ఇచ్చారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రజాజ్యోతి పత్రికకు బస్తీ వాసులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూరం రవి, గాండ్ల సురేష్, తమ్మిశెట్టి సాంబ, రహీమ్, జీవి, ప్రసాద్, స్థానికులు షన్ను, ఇబ్బు, ఆరిఫ్, మైబుబ్ మియా, రహిమా, హామీదా బేగం , రాణి, రంజాన్, రాగోల్, తదితరులు పాల్గొన్నారు.








ఏజెన్సీని పీల్చి పిప్పి చేస్తున్న ఐరన్ షాపుల మాఫియా..?

ఏజెన్సీలో ఐరన్ షాపుల దందా రోజురోజుకీ శృతిమించుతోంది. పేద గిరిజనుడి ఇంటి కలను అడ్డం పెట్టుకుని కొందరు వ్యాపారస్థులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. కిలోలో వంద గ్రాములు తూకంలో మోసం చేస్తూ, కొంత స్క్రాప్ ఇనుమును బ్రాండెడ్ గా అమ్ముతూ కొందరు జేబులు నింపుకుంటున్నారు. బిల్లు లేకుండా, పన్ను ఎగవేస్తూ సర్కార్ సొమ్ముకు గండి కొడుతున్నారు. ఇంటి నిర్మాణం పేరుతో అధిక వడ్డీకి అప్పు ఇచ్చి, చివరకు కొందరు వ్యాపారస్థులు గిరిజనుల భూములను కబ్జా చేస్తున్నారు. పదేళ్ల క్రితం రేకుల షెడ్డులో ఉన్న వ్యాపారం ఇవాళ బహుళ అంతస్థుల మేడలుగా ఎలా మారింది.? అధికారుల తనిఖీలు లేకపోవడం వెనుక మతలబు ఏంటి..? అక్రమాస్తులపై సమగ్ర విచారణ జరిపితేనే అసలు దోపిడీ బయటపడుతుంది.

- రేకుల షెడ్డు నుంచి రాజభవనాల దాకా..! ఐరన్ వ్యాపారస్థుల అంతులేని ఆస్తుల వెనుక మతలబు ఏంటి..?
- తూకంలో తంటా.. నాణ్యతలో మంటా..! బిల్లు లేని దందాతో అడవిని దోచేస్తున్న వైనం..!!
- అధికారుల కళ్లు మూతపడ్డాయా..? మూతికి ముడుపు ముట్టిందా..? ఏజెన్సీలో అనుమానాల వలయం..!
- ఇంటి నిర్మాణం పేరుతో గిరిజనులకు ఉచ్చు.. అప్పు, వడ్డీ, మోసం.. చివరకు భూ కబ్జా..!
- సర్కార్ సొమ్ముకు ఎసరు.. జీఎస్టీ లేకుండా, లెక్క లేకుండా సాగుతున్న కోట్ల దందా..!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 1, (ప్రజాజ్యోతి): – మణుగూరు పట్టణ ప్రాంతంలో కొందరు ఐరన్ వ్యాపారస్థుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. అమాయక గిరిజనుల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యత లేని ఇనుము, సిమెంట్ తదితర వస్తువులు అధిక ధరలకు అంటగడుతూ, తూకంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. అధికారుల ఉదాసీనతే ఈ మాఫియా పెచ్చుమీరడానికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి అక్రమంగా ఆర్జించిన సొమ్ముతో కోట్ల విలువైన భవనాలు వెలుస్తున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, లోతుగా విచారణ జరపాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బరువులో 100 గ్రాముల చేతివాటం.. నాణ్యతలో బ్రాండ్ పేరుతో మాయ.. ఇదే కోట్ల రహస్యం.!

అసలు దందా తూకం, నాణ్యతలో ఉంది. తూక యంత్రం లో కొన్ని సెట్టింగ్లు పెట్టి కిలోకు 100 నుంచి 150 గ్రాములు తగ్గిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. టన్నుకు లెక్కేస్తే క్వింటాళ్ల లాభం వస్తుందని తెలుస్తోంది. ఇక నాణ్యతలో బ్రాండెడ్ ఇనుము పేరు చెప్పి, ఐఎస్ఐ ముద్ర లేని స్క్రాప్ ఇనుమును రంగు వేసి అమ్ముతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికి బిల్లు అడిగితే తెల్ల చీటీ ఇచ్చి, జీఎస్టీ బిల్లు దాచేస్తున్నారని స్పష్టంగా వినపడుతోంది. దీని వల్ల ప్రభుత్వానికి పన్ను నష్టం, గిరిజనుడికి నాణ్యత లేని ఇల్లు, ఈ రెండు మోసాలే వారిని రేకుల షెడ్డు నుంచి మేడల దాకా తీసుకెళ్లాయని అర్థం అవుతోంది.

స్టాక్ రిజిస్టర్ లేకపోవడమే అక్రమాస్తులకు ఆధారమా..!

అసలు అతి పెద్ద దందా రిజిస్టర్ లెక్కల్లో ఉంది. కొన్ని ఐరన్ షాపులలో స్టాక్ రిజిస్టర్ లేదని వినిపిస్తోంది. షాపుల్లో ఎంత సరుకు వచ్చింది, ఎంత అమ్మారు, ఎంత మిగిలింది అనే లెక్కే లేదని వినపడుతోంది. లీగల్ మెట్రాలజీ లైసెన్స్ గడువు అయిపోయి ఏళ్లయినా తనిఖీ లేదని, జీఎస్టీ రిటర్న్ లో చూపేది తక్కువని, బయట అమ్మేది మాత్రం ఎక్కువని వినపడుతోంది. ఈ లెక్కలేని సొమ్ముతోనే బినామీ పేర్లతో భూములు, భవనాలు కొంటున్నారని తెలుస్తోంది. అందుకే అధికారులు ఒకేసారి నాలుగు శాఖలతో – రెవెన్యూ, మెట్రాలజీ, జీఎస్టీ, విజిలెన్స్ తో ఉమ్మడి దాడి చేస్తే ఒక్కరోజులో కోట్ల దందా ఏంటో బయటపడుతుందని స్థానిక మేధావులు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.

సీల్ లేని తూకం.. బిల్లు లేని అమ్మకం.. ఇదే మేడల మతలబు..!

ఏజెన్సీలో ఉన్న కొన్ని ఐరన్ షాపులలో రెండు వస్తువులు నేటికీ కనిపించవు. ఒకటి స్టాక్ రిజిస్టర్, రెండోది పక్కా జీఎస్టీ బిల్లు. ఇవి లేకుండానే రోజుకు లక్షలనుంచి రెండు లక్షల రూపాయల వ్యాపారం ఎలా జరుగుతోంది..? ఇదే అసలు అనుమానం అన్నట్టుగా కనిపిస్తుంది. తూకం యంత్రానికి సీల్ లేదు, అమ్మే సరుకుకు బిల్లు లేదు, అయినా ఆస్తులు మాత్రం పెరిగిపోతున్నాయి. అంటే లాభమంతా లెక్కల్లోకి రాకుండా పక్కదారి పడుతోందని అర్థం అవుతోంది. దీనిపై లోతుగా దృష్టి పెడితే బినామీల పేరుతో ఉన్న భూములు, షాపింగ్ కాంప్లెక్స్ లు, కోట్ల ఆస్తులు అన్నీ బయటకు వస్తాయని స్థానికులు, మేధావులు నొక్కి చెబుతున్నారు.

ప్రపంచ వేదికపై భద్రాచలం కీర్తి

- పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ శంకర రావుకు ఘన సన్మానం



భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): అమెరికాలోని నెవాడా రాష్ట్రం రినో నగరంలో నిర్వహించిన 2026 ఐపీఎఫ్ వరల్డ్ మాస్టర్స్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భద్రాచలానికి చెందిన విశ్రాంత ఎస్బీఐ అధికారి డి.వి. శంకరరావు రెండు పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో భద్రాచలం కీర్తిని చాటారు. అక్టోబర్ 15న జరిగిన క్లాసిక్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం, అక్టోబర్ 22న జరిగిన ఎక్విప్డ్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించారు. మాస్టర్స్–4, 74 కిలోల విభాగంలో భారత్ తరపున పాల్గొని ఈ విజయాలను అందుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి సాయం వాకర్స్ ఆధ్వర్యంలో డి.వి. శంకరరావును ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేశారు. గతంలో గుండెకు బైపాస్ శస్త్రచికిత్స జరిగినప్పటికీ, 74 ఏళ్ల వయసులో పట్టుదలతో సాధన కొనసాగించి ప్రపంచస్థాయి పోటీల్లో రెండు పతకాలు సాధించడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. వయసు, ఆరోగ్య సమస్యలు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని శంకరరావు నిరూపించారని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి, దుర్గారావు, తుల సూర్యనారాయణ, తుమ్మ చంద్రశేఖరరావు, అనుముల్ల గంగాధరరావు, వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ సత్యనారాయణ, ప్రసాదు, ఆకుల సత్యనారాయణ, పసుపులేటి వెంకట్, కొర్లపాటి రాము, శ్రీనివాసాచారి, మల్లికార్జునరావు, జగ్గా పుల్లయ్య, కె. రామలింగేశ్వరరావు, బాలు, రఘురామ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

గోదావరి నదీహారతిని వీక్షించడం మహా పుణ్యం

- భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్



భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): ఆశ్వయుజ బహుళ సప్తమి సందర్భంగా గోదావరి మాతకు సమర్పించే నదీహారతిని భక్తిశ్రద్ధలతో వీక్షించడం మహా పుణ్యప్రదమని భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ అన్నారు. ఆదివారం గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహించిన నదీహారతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గత ఏడాది కాలంగా ప్రతి ఆదివారం శ్రీరామచంద్ర స్వామివారికి ప్రీతిపాత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలు తుఫానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి క్షేమంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని లోకకల్యాణార్థం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. గణపతి పూజ, దీపోత్సవం, అష్టోత్తర శతనామార్చన అనంతరం శాంతి మంత్ర పఠనంతో హారతి కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం రవికుమార్ లక్ష్మీదంపతులు, టీవీఎస్ఎన్ రెడ్డి దంపతులు సమర్పించిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్యప్రసాద్ శర్మ, రామాచార్యులు, తిరుపతిరావు, తేజశర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంకేర్ లో నక్సల్ డంప్ స్వాధీనం

- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, భారీగా సామగ్రి స్వాధీనం





చర్ల, నవంబర్ 01 (ప్రజా జ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో నక్సల్ నిర్మూలన చర్యల్లో భాగంగా భద్రతా దళాలు గణనీయమైన విజయం సాధించాయి. జిల్లాలోని సున్నితమైన అటవీ ప్రాంతాల్లో కొనసాగుతున్న గాలింపు చర్యల్లో భాగంగా నక్సల్స్‌కు చెందిన డంప్‌ను గుర్తించి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఐఈడీతో పాటు ఇతర పేలుడు పదార్థాలను భద్రతా దళాలు అక్కడికక్కడే ధ్వంసం చేశాయి.బస్తర్ రేంజ్ ఐజీ బద్రి నారాయణ్ మీనా, భానుప్రతాప్‌పూర్ బీఎస్ఎఫ్ డీఐజీ దీపక్ తివారీ, కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ రాఖేచా, 94వ బీఎస్ఎఫ్ బండే బెటాలియన్ 2ఐసీ ఇన్‌చార్జి కమాండర్ సుభాష్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లాలో నక్సల్ నిర్మూలన ప్రచారం నిరంతరంగా కొనసాగుతోంది.ఈ క్రమంలో అక్టోబర్ 31న ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని జురహాన్ మెహదా, మచ్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న అటవీ, కొండ ప్రాంతంలో జిల్లా పోలీసు బలగాలు, బీఎస్ఎఫ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా నక్సల్స్‌కు చెందిన డంప్‌ను గుర్తించి అందులోని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిలో రెండు భర్మర్ గన్లు, సుమారు రెండు కిలోల బరువున్న ఒక ప్యాకెట్ ఐఈడీ, 24 బిగియల్ సెల్స్, ఒక వైర్‌లెస్ సెట్, నాలుగు పౌచ్‌లు, ఒక జీపీఎస్ పరికరం, 14 టపాసులు, ఒక ఫోటో కాంట్రైల్‌తో పాటు మందులు, నక్సల్ సాహిత్యం, ఇతర నక్సల్ సామగ్రి ఉన్నాయి. పేలుడు పదార్థాలు భద్రతా దళాలకు, స్థానిక ప్రజలకు ముప్పుగా మారకుండా వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.ఈ ఆపరేషన్‌ను బీఎస్ఎఫ్ 94వ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ నాయకత్వంలో నిర్వహించగా బృంద కమాండర్‌గా సుమన్ కంతోసు వ్యవహరించారు.నక్సల్ ప్రభావిత సరిహద్దు ప్రాంతాల్లో కాంకేర్ పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు నిరంతరం సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నక్సల్ కార్యకలాపాలను అరికట్టేందుకు భద్రతా దళాలు ముమ్మర గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి అని అధికారులు తెలిపారు.

గిరిజన దర్బార్ కు అధికారులు సకాలంలో హాజరు కావాలి

► ఐటీడీఏ పీఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించే గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు. సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

రామాలయానికి రూ.40 వేల విలువైన కార్పెట్లు వితరణ



భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి హైదరాబాదులోని ఓయాసిస్ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, హరిత దంపతులు, వారి కుమార్తె, కుమారుడు విశృత్, యషిత రూ.40 వేల విలువైన రెండు కార్పెట్లను ఆదివారం దేవస్థానం అధికారులకు అందజేశారు. ఈ సేవా కార్యక్రమానికి సాయిబాబా ఆలయ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, ప్రముఖ సమాజ సేవకులు వై.కదాలి నాగరాజు సహకారం అందించారు.గతంలో ఇదే సంస్థ కలర్ ప్రింటర్‌ను కూడా అందజేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. అవసరమైన వస్తువులను అందిస్తూ రామాలయం అభివృద్ధికి తోడ్పడుతున్న దాతల సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కేదామోదర్ రావు, ఏ ఈ ఓ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల బదిలీపై సమగ్ర విచారణ జరపాలి



భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): భద్రాచలం గ్రామపంచాయతీ నిధుల నుంచి ఉద్యోగి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు బదిలీ అయినట్లు ఆర్టీఐ ద్వారా వెల్లడైన రూ.23 లక్షల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని భద్రాచలం పౌరుడు, భద్రాద్రి యువజన అభివృద్ధి ఫోరం గౌరవాధ్యక్షుడు గద్దం శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధుల బదిలీకి సంబంధించిన అనుమతులు, బిల్లులు, వోచర్లు, లెక్కల సర్దుబాటుపై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు.అలాగే జీఓ 569 ప్రకారం గతంలో భద్రాచలంలో నాలుగేళ్లు పనిచేసిన పంచాయతీ కార్యదర్శి తిరిగి అదే స్థానానికి రావడం వెనుక ఉన్న చట్టబద్ధత, ఆయనకు చెల్లిస్తున్న వేతనం, పదవీ విరమణ ప్రయోజనాలపై వివరాలు వెల్లడించాలని కోరారు. అనుమతులు లేని ఏడంతస్తుల భవనం కూలిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కోర్టుకు ఇచ్చిన హామీ ఉల్లంఘనపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ విషయంలోనూ అధికారులు స్పందించాలన్నారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికను ప్రజలకు వెల్లడించాలని ఆయన కోరారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత, అధికారుల జవాబుదారీతనం ఉండాలని ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ప్రశ్నించారు.

ఏటీఏ మండల నూతన కమిటీ ఎన్నిక



చర్ల, నవంబర్ 01(ప్రజా జ్యోతి):ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) చర్ల మండల నూతన కమిటీని ఆదివారం ఉంజుపల్లి ఏహెచ్ఎస్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నానమాద్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, సంఘ బలోపేతంపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నానమాద్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు గ్రేడ్–2, వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మిగిలిపోయిన పీజీహెచ్ పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. చర్ల మండల ఏటీఏ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్యామల రామారావు, ప్రధాన కార్యదర్శిగా సోయం శేషు, ఉపాధ్యక్షులుగా దేశ ధనలక్ష్మి, కోర్స హైమావతి, గౌరవ సలహాదారుగా తుర్రం సావిత్రి, సలహాదారుగా పోడియం రామకృష్ణ, కోశాధికారిగా మెండి రాజకుమార్ ఎన్నికయ్యారు.ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కే. రాజబాబు, కారం సురేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్. శ్యామ్ కుమార్, తునికి పాండురాజు ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శులుగా ఎం. సుజాత, ఎం. వరలక్ష్మి, పి. సుగుణ, టి. లక్ష్మి, ఎం. జయమ్మలను ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా కనితి మురళీమోహన్, కాక సత్యనారాయణ, వల్లే వెంకట్రావు, తాటి శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, పి.రాజుశంకర్, ఎం.రాజు, ఎం.అశోక్, కె.నవీన్, ఎస్. దుర్గాభవాని, జి. బాలసత్య తదితరులు ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బెండబోయిన సత్యనారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి కోర్స చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి తోకల లక్ష్మీపతి, భద్రాచలం మండల బాధ్యులు పూనెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ప్రజా సమస్యలను పట్టించుకునే వారే లేరు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారు
- బూర్గంపాడు, చర్ల , వెంకటాపురం రహదారులపై విమర్శలు.
- భద్రాచలంలో పడకేసిన పారిశుద్ధ్యం, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్యలపై నిలదీత
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య

భద్రాచలం, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): భద్రాచలం నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నా పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య విమర్శించారు. ఆదివారం హరిత హోటల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు.పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, వీధుల్లో చెత్త పేరుకుపోతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న నాయకులు కనీస పారిశుద్ధ్య సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న పేదలకు అన్ లైన్, మాన్యువల్ విధానాల్లో ఇబ్బందులు కల్పిస్తున్నారని, ఇళ్ల మంజూరు వివరాలు కూడా వెల్లడించడం లేదని విమర్శించారు.బూర్గంపాడు రహదారి దుస్థితితో విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం ఆర్టీసీ బస్సుల మార్గాలనైనా మార్చి ప్రయాణికులకు ఉపశమనం కల్పించాలని కోరారు. చర్ల–వెంకటాపురం మార్గంలో అత్యవసర వైద్య సేవలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఇసుక అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.దుమ్ముగూడెం మండలంలో సాగునీరు అందక రైతులు పంటలు నష్టపోతున్నారని, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.భద్రాచలంలో ప్రభుత్వ వ్యవస్థ నడుస్తోందా, ప్రైవేటు వ్యక్తుల ప్రభావం కొనసాగుతోందా అని ప్రశ్నిస్తూ, ప్రజాప్రతినిధుల చుట్టూ వస్తున్న ఆరోపణలపై స్పందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని కనగాల చైతన్య స్పష్టం చేశారు.



గిరిజనుల చెంతకు వైద్య సేవలు

- మూడు రోజుల సేవా యాత్రలో 700 మందికి వైద్య పరీక్షలు





చర్ల, నవంబర్ 01(ప్రజా జ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించి, వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్న ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ) తెలంగాణ ఆధ్వర్యంలో, సేవా భారతి, వనవాసి కళ్యాణ పరిషత్ సహకారంతో నిర్వహించిన మూడు రోజుల శ్రీ రామదాసు స్వాస్థ్య సేవా యాత్ర–2026 విజయవంతంగా ముగిసింది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు చర్ల మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిర్వహించిన ఈ వైద్య సేవా కార్యక్రమం ద్వారా 700 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ యాత్రలో వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇంటర్న్‌లు, పీజీ వైద్యులు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు వైద్య సంప్రదింపులు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరాల్లో గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పలు ఆరోగ్య సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహార లోపం, అధిక రక్తపోటు, మధుమేహం, క్షయవ్యాధి, చర్మవ్యాధులు, కంటి సమస్యలు ఎక్కువగా గుర్తించినట్లు వైద్య బృందం వెల్లడించింది. శిబిరాల్లో నిర్వహించిన పరీక్షల్లో కనీసం 83 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించగా, వారిలో ఆరుగురికి తీవ్రమైన రక్తహీనత ఉన్నట్లు నిర్ధారించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలు ఎక్కువగా కనిపించడంతో ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు సూచించారు. చిన్నారుల్లో తక్కువ బరువు, పోషకాహార లోపాన్ని గుర్తించి సరైన ఆహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల పర్యవేక్షణలో ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే 35 మందిలో అధిక రక్తపోటు, 19 మందిలో మధుమేహం గుర్తించారు. కొంతమందికి తొలిసారిగా మధుమేహం ఉన్నట్లు గుర్తించడం ద్వారా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని వైద్య బృందం వివరించింది. వైద్య శిబిరాల్లో కనీసం ఐదు క్షయవ్యాధి కేసులు గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీటిలో క్రియాశీల వ్యాధి కేసులతో పాటు పునరావృత కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. మరికొంతమందిలో క్షయవ్యాధి అనుమానిత లక్షణాలు కనిపించడంతో తదుపరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాధితులను సంబంధిత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేసి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య బృందం సూచించింది. చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లు ముఖ్యంగా చిన్నారుల్లో ఎక్కువగా కనిపించాయి. గజ్జి, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఇతర చర్మ సంబంధిత సమస్యలకు వైద్య సేవలు అందించడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కంటిశుక్లం, ఇతర దృష్టి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సుమారు 17 మందిని గుర్తించి, అవసరమైన వారికి తదుపరి కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స కోసం ఉన్నత వైద్యకేంద్రాలకు పంపించాలని సూచించారు. వైద్య శిబిరాల్లో జ్వరం, జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, గ్యాస్ట్రిక్ సమస్యలు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సంప్రదింపులు, అవసరమైన చికిత్స అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉండాలని మందులను క్రమం తప్పకుండా వినియోగిస్తూ ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో చికిత్స కొనసాగించాలని సూచించారు. వైద్య సేవలతో పాటు ఆరోగ్య అవగాహనకు కూడా ప్రాధాన్యతనిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యం, అంటు వ్యాధుల నివారణ, దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, పొగాకు, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థులకు గిరిజన ప్రాంతాల్లోని ప్రజారోగ్య సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా సామాజిక బాధ్యత, సేవా భావం, వైద్య వృత్తిలో మానవీయ విలువలను పెంపొందించే ప్రయత్నం చేశారు. వైద్య శిబిరాల్లో గుర్తించిన ఆరోగ్య సమస్యలకు తక్షణ వైద్య సేవలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరమని నిర్వాహకులు తెలిపారు. రక్తహీనత, తీవ్రమైన పోషకాహార లోపం, క్షయవ్యాధి, రక్తపోటు, మధుమేహం, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని సంబంధిత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర వైద్య సదుపాయాలకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందితో సమన్వయం పెంచి బాధితులకు తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స, నిరంతర పర్యవేక్షణ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందని ప్రజలకు అందగా నిలవడం, వైద్య విద్యార్థులు తమ వైద్య విజ్ఞానాన్ని సమాజ సేవకు అన్వయించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన సేవా భారతి, వనవాసి కళ్యాణ పరిషత్, స్థానిక ప్రతినిధులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, వాలంటీర్లు, దాతలకు నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్–తెలంగాణ కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలను చేరువ చేస్తామని తెలిపారు.

దమ్మపేటలో గంజాయి కలకలం

- ఎనిమిది మందిపై పోలీసుల చర్యలు
- గంజాయి సేవించిన ఆరుగురికి డీ-అడిక్షన్
- పావు కిలో గంజాయితో పట్టుబడిన ఇద్దరికి రిమాండ్



దమ్మపేట, నవంబర్ 1, (ప్రజా జ్యోతి) మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ ఆర్. నటీష్ కుమార్ సూచనలతో దమ్మపేట పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఆరుగురితో పాటు, గంజాయి కలిగి ఉన్న మరో ఇద్దరు పట్టుబడ్డారు. అక్టోబర్ 31వ తేదీన దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఆర్లపెంట గ్రామ శివారులోని స్మశానవాటిక వద్ద గంజాయి సేవిస్తున్న ఆరుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారికి నిర్వహించిన యారిన్ డ్రగ్ పరీక్షల్లో టిహెచ్‌సీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అనంతరం విచారణలో లంకాలపల్లికి చెందిన పొట్ట సాయికుమార్ అలియాస్ సాయి, నాగుపల్లికి చెందిన లవుడియా చైతన్య వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి మొత్తం పావు కిలో గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో పట్టుబడిన ఎనిమిది మందిని దమ్మపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు గంజాయి సేవించిన ఆరుగురిని డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని రిమాండ్‌కు పంపించారు. గంజాయి సరఫరా, విక్రయాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వ, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి ఖాదర్ బాబు కృషి ఎనలేనిది

- ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి: కూనంనేని సాంబశివరావు





పాల్వంచ, నవంబర్ 1, ప్రజాజ్యోతి: పేద ప్రజలు, కార్మికుల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన ఉప్పుశెట్టి ఖాదర్ బాబు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్మికులు, పేదల పక్షపాతిగా ఆయన వేసిన ముద్ర నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. సీపీఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమితి సభ్యులు, ప్రముఖ న్యాయవాది, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పుశెట్టి ఖాదర్ బాబు 9వ వర్ధంతిని ఆదివారం పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ లో ఏర్పాటు చేసిన ఖాదర్ బాబు స్మారక స్థూపం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఖాదర్ బాబు అంచెలంచెలుగా ఎదిగి జిల్లా స్థాయి నాయకుడిగా, పేదల గొంతుకగా గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, వాటి పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసేవారని పేర్కొన్నారు. పాల్వంచ ప్రాంత ప్రజలను కమ్యూనిస్టు ఉద్యమాల వైపు నడిపించడంలో, పార్టీ విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఖాదర్ బాబుతో తనకున్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన రోజులను ఈ సందర్భంగా కూనంనేని స్మరించుకున్నారు. ఆయన లేని లోటు వ్యక్తిగతంగా తనకు ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా, ప్రజా నాయకుడిగా పాల్వంచ ప్రాంతంలో ఖాదర్ బాబు చెరగని ముద్ర వేశారని అన్నారు. ఖాదర్ బాబు ఆశయాలను ఆచరణలో సాధించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొంటూ, నాయకులు, కార్యకర్తలు ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్మిస్తూ, పాల్వంచ ప్రాంతంలో సీపీఐని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్ర రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్ వాడే లక్ష్మి, టీడీపీ నాయకులు కనగాల అనంతరాములు, వర్తక సంఘం కన్వీనర్ చాలా వాది ప్రకాష్, జిల్లా సమితి సభ్యులు వి. పద్మజ, డి. సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజాసంఘాల నాయకులు శనగరపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు తదితరులు, ఖాదర్ బాబు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీల అడ్వైజరీ కమిటీ

- సభ్యుడిగా డాక్టర్ యుగంధర్ రెడ్డి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నిర్వహణ కమిటీలో చోటు
- పలువురి అభినందనలు



పాల్వంచ, నవంబర్ 1, ప్రజాజ్యోతి : హైదరాబాద్‌లో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహ ణ కమిటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్ యుగంధర్ రెడ్డికి చోటు లభించింది. పోటీల నిర్వహణకు సంబంధించిన అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఆయనను నియమించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీల నిర్వహణ కమిటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డాక్టర్ యుగంధర్ రెడ్డికి అవకాశం కల్పించడం పట్ల జిల్లా క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.అభినందనలు తెలిపిన వారిలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు వై. వెంకటేశ్వర్లు, పుట్ట శంకరయ్య, ప్రేమ్ కుమార్, రమేష్, వాసు, అన్నం వెంకటేశ్వర్లు, రాజకుమార్, జకరయ్య, సుందరరాజు, చలం, నానా ఫర్నవేస్, దాట్ల రాజు, సలీం, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 1,(ప్రజా జ్యోతి) కలెక్టరేట్ గాంధీ చౌక్ వద్ద 5 రోజులుగా కొనసాగుతున్న ఎన్ హెచ్ ఎం సమ్మెకు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ హెల్త్ డైరెక్టర్ డా. గడల శ్రీనివాసరావు ఆదివారం సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్లుగా ఎన్ హెచ్ ఎం లతో కలిసి పనిచేసిన అనుభవం తనకు ఉందని, వారి కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా వారి సమ్మె గురించి తెలుసుకున్నప్పుడు ఎంతో బాధ కలిగిందని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.అవసరమైతే వారితో పాటు పోరాటం చేస్తామనీ, అవసరం లేని పథకాలు తెచ్చారు కానీ అవసరమున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల బాధలు తీర్చండి అని ప్రభుత్వాన్ని కోరారు, అవసరమైతే ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణ , జనసేన పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యకర్తలు జనసైనికులు , మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి ఎక్కడ?

- అశ్వాపురంలో ఆట స్థలం ఏదీ?
- యువత భవిష్యత్తుతో అధికారుల చెలగాటం!
- ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరుగు సాధనకు స్థలం కరువు
- క్రీడా మైదానం లేక చిన్నారులు, యువతకు తప్పని ఇక్కట్లు
- నిద్రావస్థలో అధికారులు.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు!



అశ్వాపురం నవంబర్ 1, ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో ఆటస్థలం లేకపోవడం యువత, చిన్నారులు, క్రీడాకారులకు శాపంగా మారుతోంది. మండల కేంద్రంలో ప్రజలకు ఉపయోగపడే పూర్తిస్థాయి క్రీడా మైదానం లేకపోవడంతో ఆటలు ఆడాలన్నా, వ్యాయామం చేయాలన్నా, ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరుగు పందెం సాధన చేయాలన్నా యువతకు ఇబ్బందులు తప్పడం లేదు. అభివృద్ధి గురించి మాట్లాడుతున్న పాలకులు, అధికారులు యువతకు కనీస క్రీడా సదుపాయాలు కల్పించడంపై ఎందుకు దృష్టి సారించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

›› ఉద్యోగార్థులకు పరుగు పందెం పరీక్ష.. సాధనకు స్థలం ఏది?

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో ఆశతో సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు పోలీసు, ఆర్మీ తదితర ఉద్యోగాల శారీరక సామర్థ్య పరీక్షలు కీలకం. వీటిలో అర్హత సాధించాలంటే ప్రతిరోజూ పరుగు పందెం, శారీరక వ్యాయామాలు సాధన చేయాలి. కానీ అశ్వాపురంలో ప్రత్యేకమైన మైదానం లేకపోవడంతో అభ్యర్థులు సాధన కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై పరుగులు తీయాల్సి వస్తే వాహనాల రాకపోకలతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. యువత భవిష్యత్తుకు ఇంత కీలకమైన అంశంపై అధికారులు స్పందించకపోవడం బాధాకరం

›› చిన్నారుల క్రీడా ప్రతిభకు సంకెళ్లు!

ఆటలు పిల్లల్లో శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయి. అయితే ఆటలాడేందుకు సరైన స్థలం లేకపోవడంతో చిన్నారులు క్రీడలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన వేదిక కల్పించకపోతే వారి నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. పిల్లలు, యువతకు క్రీడా సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది.

›› రోడ్లు, భవనాలే అభివృద్ధా? మైదానాలపై నిర్లక్ష్యమెందుకు?

ఒక మండలం అభివృద్ధి చెందిందంటే కేవలం రహదారులు, భవనాలు నిర్మించడమే కాదు. ప్రజల ఆరోగ్యానికి, యువత భవిష్యత్తుకు ఉపయోగపడే సదుపాయాలు కూడా అందుబాటులో ఉండాలి. వృద్ధులు నడక సాగించేందుకు, మహిళలు వ్యాయామం చేసేందుకు, పిల్లలు ఆటలాడేందుకు, యువత ఉద్యోగాలకు అవసరమైన శారీరక సాధన చేసేందుకు ఒకే మైదానం ఎంతగానో ఉపయోగపడుతుంది. అయినప్పటికీ అశ్వాపురంలో క్రీడా మైదానం ఏర్పాటు దిశగా తగిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

›› అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి!

అశ్వాపురం మండలంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని యువత, క్రీడాభిమానులు కోరుతున్నారు. రన్నింగ్ ట్రాక్‌తో పాటు కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్థల పరిశీలన చేసి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.యువతకు క్రీడా మైదానం కల్పించడం దయ కాదు.. వారి భవిష్యత్తుకు అవసరమైన కనీస బాధ్యత. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అశ్వాపురం మండలానికి క్రీడా మైదానం మంజూరు చేస్తారా? లేక యువత సమస్యను ఇలాగే గాలికి వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి.

అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేత సోయం వీరభద్రం విస్తృత పర్యటన



అశ్వారావుపేట నవంబర్ 1 ప్రజాజ్యోతి అశ్వరావుపేట నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ఆదివారం పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగిన శుభకార్యాలతో పాటు, సంతాప కార్యక్రమాలకు హాజరై ప్రజలతో మమేకమయ్యారు.ఈ రోజు ఉదయం అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన ఇటుకల హరిబాబు – ప్రియాంక దంపతుల కుమార్తెలు హిమవర్షిణి, రితు వర్షిణిల ఓణిల అలంకరణ వేడుక పెనుబల్లి మండలం తాళ్ళపెంట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు విచ్చేసిన సోయం వీరభద్రం చిరంజీవులను ఘనంగా ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం గ్రామానికి వెళ్లారు. అక్కడ బీఆర్ఎస్ వార్డు సభ్యులు రాంబాబు బంధువైన ఆళ్ళ సుబ్బయ్య (దుర్గయ్య) దశదినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు.సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శోకసంద ర్భంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.





అక్కడి నుంచి బయలుదేరిన ఆయన ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన కుంజా సంతోషమ్మ పెద్దకర్మల కార్యక్రమానికి చేరుకున్నారు. సంతోషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యం కల్పించారు.ఈ పర్యటనలో సోయం వీరభద్రంతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసాని నాగశేషపద్మ, చంద్రమోహన్, అశ్వారావుపేట మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ డాక్టర్ భుక్య ఉదయజ్యోతి-ప్రసాద్, మోటురి మోహన్, వేముల హరీష్, మాజీ ఎంపీటీసీ ఐలూరి కృష్ణారెడ్డి, సోని శివశంకర్, సోయం చిన్నారి, తాటి రమణ, ప్రసాద్, సరిహద్దుల వెంకటేశ్వరరావు, బద్దే సత్యనారాయణ, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు

రాజకీయాలకు కుల మతాలకు అతీతంగా

పాల్వంచలో ఘనంగా మాజీ మంత్రి వనమా జన్మదిన వేడుకలు

- వనమాకు "చరవాణి "ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్ మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావులు
- పుట్టినరోజు వేడుకలకు హాజరైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- మాజీమంత్రి పువ్వాడ
- స్థానిక శాసన సభ్యులు కూనం నేని సాంబశివరావు
- బ్లాక్ మార్కులేని రాజకీయ నాయకులు వనమా మాజీ మంత్రి పువ్వాడ
- కెసిఆర్ కు మెచ్చిన నాయకుడంటే "వనమా"నే వద్దిరాజు రవిచంద్ర
- రాజకీయాలలో ద్వేషాలు కంటే ప్రేమానురాగాలు ముఖ్యం స్థానిక శాసన సభ్యులు కూనంనేని









కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 1 (ప్రజా జ్యోతి)

పాత పాల్వంచకు చెందిన వనమా నాగభూషణం అన్నపూర్ణమ్మ ల తనయుడు మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు 82వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం పాత పాల్వంచలో ఘనంగా జరిగాయి,వనమా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన సంబరాలు పాల్వంచలో అంబరాసంటాయి, రాజకీయాలకు అతీతంగా, కులమతాలకు అతీతంగా జరిగిన వనమా పుట్టినరోజు వేడుకలకు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది ప్రముఖులు హాజరై వనమా వెంకటేశ్వరరావు, సతీమణి పద్మావతి దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు, వర్మ పుట్టినరోజును పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ మంత్రి కేటీఆర్ ,హరీష్ రావులు "చరవాణి" ద్వారా వనమాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, వనమా నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో ఉంటూ ప్రజలకు ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు, అదేవిధంగా వనమా జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,కొత్తగూడెం నియోజకవర్గశాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, నియోజకవర్గాలకు చెందిన , మాజీ తాజా ఎమ్మెల్యేలు హాజరై వనమా దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా నిర్వహించిన జన్మదిన వేడుకల్లో వారు మాట్లాడుతూ వనమా రాజకీయ సుదీర్ఘ ప్రయాణంలో నేటి వరకు బ్లాక్ మార్క్ లేని నాయకునిగా పేరుగావించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు, వనమా తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావుకు సమకాలీకులని, తనకు తండ్రితో సమానులని ,మా ఊరు కూనవరం అని, వనమా ఊరు మర్రిగూడెం అని, గోదావరి నీళ్లు తాగి పెరిగిన వాళ్ళమని, గోదావరి పొంగితే గుట్టలెక్కిన వాళ్ళమని,గోదావరి తగ్గితే బిందెలు పట్టుకొని నీళ్లకు పోయిన వాళ్లమని ,ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో మమేకమై ప్రజల జీవన ప్రమాణాలు పెంచిన గొప్ప నాయకులు తన నాన్నతో పాటు వనమా వెంకటేశ్వర రావు అని కొనియాడారు, వనమా సర్పంచ్ స్థాయి నుండి మున్సిపల్ చైర్మన్గా , నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ,రాష్ట్రమంత్రిగా ఎదిగిన వనమా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం డిసిసి అధ్యక్షుడిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రికార్డు స్థాయిలో పనిచేసిన వ్యక్తి అని, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో గెలుపోటములు చూసిన మహోన్నత వ్యక్తి అని, ఆయనపై నేటి వరకు బ్లాక్ మార్కు లేకుండా ఉన్న గొప్ప వ్యక్తి వనమా అని కొనియాడారు, కొత్తగూడెం సింగరేణి ప్రాంతాలలో ఎంతో మందికి ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు ,వేలాది కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలిచారన్నారు, సాధారణంగా ఎమ్మెల్యే కాగానే ఎవరైనా హైదరాబాదులో స్థిరపడతారని అనుకుంటారు కానీ, వనమా మంత్రిగా ఉన్నప్పటికీ నిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో పాత పాల్వంచ లోనే ఉంటూ కొన్ని వేల కోట్ల రూపాయల వ్యయంతో కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దిన ఘనత వనమాకే దక్కుతుందన్నారు, వనమా కేసీఆర్ తో చేతులు కలిపింది కూడా తన స్వార్థం కోసం కాదని, కేవలం కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కెసిఆర్ తో కలిసి కొత్తగూడెం కార్పొరేషన్, పాల్వంచ మున్సిపాలిటీ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ఎంతో కృషిచేసిన వ్యక్తి అని కొనియాడారు, తెలంగాణ ఉద్యమ సమయంలో ఖమ్మం జిల్లాలో గల మెత్తిన అతి కొద్ది మంది నాయకుల్లో వనమా నిలిచారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన చెరిపేయలేని ముద్ర వేసుకున్నారని అన్నారు.అనంతరం రాజ్యసభ సభ్యులు "వద్దిరాజు "రవిచంద్ర మాట్లాడుతూ రాజకీయాలలో కొందరు పదవులు ద్వారా గుర్తింపు తెచ్చుకుంటారని, మరి కొందరు తమ సేవలు ,పోరాటాలు ప్రజలతో ఉన్న అనుబంధం ద్వారా చరిత్రలో నిలిచిపోతారని, అలాంటి వారిలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన వ్యక్తి వనమా వెంకటేశ్వరరావు అని ,ఆయన జీవితం ఒక వ్యక్తి ఎదుగుదల మాత్రమే కాదని, పట్టుదల కృషి, నాయకత్వం ప్రజాసేవ సమాహారం అందుకే వనమా అంటే ఒక పేరు మాత్రమే కాదు ఒక రాజకీయ శక్తి అని కొనియాడారు, తన రాజకీయ 50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైన ఎదురొడ్డి నిలిచిన మెరుగు పర్వతం అని కొనియాడారు, వనమా కొత్తగూడెం ఎల్ ఎం బి బ్యాంక్ చైర్మన్గా, బాధ్యతలు నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి విశేష కృషిచేసి రైతు బంధువుగా గుర్తింపు పొందారని, అనంతరం కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయాలలో తిరుగులేని ప్రజాదరణ సంపాదించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని ,ఆర్టీసీ చైర్మన్గా ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సుమారు 16 సంవత్సరాల పాటు పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు, అదే విధంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో వైద్య విధాన పరిషత్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి వైద్య రంగ అభివృద్ధికి అనేక సేవలు అందించారని కొనియాడారు, అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయాలలో ద్వేషాలు ముఖ్యం కాదని ప్రేమానురాగాలే ముఖ్యమని అన్నారు, ఎన్నికల సమయంలో రాజకీయంలో అనేకం ఉన్నప్పటికీ తిరిగి మళ్లీ రాజకీయ ప్రస్థానంలో నియోజకవర్గ ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశల కృషి చేయడమే తమ లక్ష్యమని అంటూ వనమా కూడా తన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో కొత్తగూడెం నియోజకవర్గం ప్రజలకు అనేక సేవలందించడంతోపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకొచ్చారని కొనియాడారు, అనంతరం మాజీ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలలో వనమా నేటి రాజకీయ నాయకులకు గురువుగా నిలుస్తారని అన్నారు, వనమా నుండి ఎన్నో రాజకీయ పాఠాలు నేర్చుకోవాలని అన్నారు,అదేవిధంగా వనమా జన్మదిన వేడుకలు సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మాజీ తాజా ఎమ్మెల్యేలు, జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాల నాయకులు, కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రముఖులు, కార్పొరేషన్ లోని పలువురు కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు మహిళా నాయకురాలు పాల్గొని దంపతులను ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, వనమా తనయులు వనమా రాఘవేంద్రరావు, రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

- 'ప్రజాజ్యోతి' పరిశోధనాత్మక కథనాలతో హడలెత్తిపోయిన అక్రమార్కులు!
- రూ. 50 లక్షల అడ్వాన్స్ సొమ్ము తిరిగి చెల్లించేందుకు ఒప్పందం?
- స్థానిక సీపీఎం నేత సమక్షంలో ముగిసిన రహస్య పంచాయితీ!
- రూ. 20 లక్షల నగదు వాపస్.. మిగతా మొత్తానికి 3 ఎకరాల పొలం అప్పగింత ఒప్పందం?
- పంచిపెట్టిన సొమ్ము వెనక్కి రాక సూత్రధారి అసహనం.. తీసుకున్నవారు ముఖం చాటేస్తున్నట్లు ప్రచారం!
- 'ప్రజాజ్యోతి'కి అసలు నిజాలు వెల్లడించే ఆలోచనలో ముఖ్య సూత్రధారి.. అప్రూవర్‌గా మారేందుకు సన్నాహాలు?
- పెద్దలంతా తమ సొమ్ములు సర్దుకున్నారు.. బాధిత గిరిజన రైతుకు జరిగిన నష్ట పరిహారమేది..?



డామిట్.. కథ అడ్డం తిరిగింది..!



లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పరిధిలోని సుమారు 60 ఎకరాల భూమి వ్యవహారంలో కథ అడ్డం తిరిగినట్లు కనిపిస్తోంది. గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళి సాగు చేసిన జామాయిల్ తోటను ధ్వంసం చేసిన ఘటనపై 'ప్రజాజ్యోతి' దినపత్రిక వరుసగా వెలువరించిన పరిశోధనాత్మక కథనాలతో ఈ వ్యవహారంలోని అనేక అనుమానాస్పద కోణాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా 'భూకబ్జా స్కిప్ట్' పేరుతో ప్రచురించిన విశ్లేషణాత్మక కథనంలో, కౌలు రైతు సాగులో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని విక్రయించేందుకు వేసిన వ్యూహాన్ని, రెవెన్యూ నివేదికలను ఆధారాలతో ప్రజల ముందుంచడం జరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 01, ప్రజాజ్యోతి :

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పరిధిలోని సుమారు 60 ఎకరాల భూమి వ్యవహారంలో కథ అడ్డం తిరిగినట్లు కనిపిస్తోంది. గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళి సాగు చేసిన జామాయిల్ తోటను ధ్వంసం చేసిన ఘటనపై 'ప్రజాజ్యోతి' దినపత్రిక వరుసగా వెలువరించిన పరిశోధనాత్మక కథనాలతో ఈ వ్యవహారంలోని అనేక అనుమానాస్పద కోణాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా 'భూకబ్జా స్కిప్ట్' పేరుతో ప్రచురించిన విశ్లేషణాత్మక కథనంలో, కౌలు రైతు సాగులో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని విక్రయించేందుకు వేసిన వ్యూహాన్ని, రెవెన్యూ నివేదికలను ఆధారాలతో ప్రజల ముందుంచడం జరిగింది. ఈ కథనాలతో భూమి వ్యవహారం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారగా, కొనుగోలుదారులు తమ పెట్టుబడుల భద్రతపై అందోళన చెందే పరిస్థితి ఏర్పడింది. తమ సొమ్ము తిరిగి ఇవ్వాలని కొనుగోలుదారులు పట్టుబట్టడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. దీంతో కోట్లాది రూపాయల భూమి విక్రయానికి సాగిన ప్రయత్నాలు ఇప్పుడు అడ్వాన్స్ సొమ్ము తిరిగి చెల్లింపుల చర్చల వరకు చేరడం గమనార్హం.

సీపీఎం నేత సమక్షంలో రహస్య పంచాయితీ

ఈ వివాదాస్పద భూమిని చూపించి తమ వద్ద నుంచి రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారని, ఆ భూమిపై ఉన్న వివాదాల విషయం తర్వాత తెలిసిందని సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమ డబ్బులను తిరిగి చెల్లించాలని సంబంధిత వ్యక్తులపై ఒత్తిడి తీసుకువచ్చిననేపథ్యంలో, ఈ వ్యవహారాన్ని సర్దుబాటు చేసేందుకు స్థానిక సీపీఎం నాయకుడి సమక్షంలో ఇరువర్గాల మధ్య రహస్యంగా చర్చలు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ చర్చల్లో వ్యాపారుల నుంచి తీసుకున్న రూ. 50 లక్షల అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు సంబంధిత వ్యక్తులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇక ఈ చర్చల్లో కుదిరినట్లు చెబుతున్న ఒప్పందం ప్రకారం, వ్యాపారుల నుంచి తీసుకున్న రూ. 50 లక్షల అడ్వాన్స్‌లో రూ. 20 లక్షలు నగదుగా తిరిగి చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మిగిలిన రూ. 30 లక్షల బకాయి మొత్తానికి బదులుగా ఈ సూత్రధారికి మరో ప్రాంతంలో ఉన్న సుమారు 3 ఎకరాల భూమిని సదరు వ్యాపారులకు అప్పగించే ప్రతిపాదనపై ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఆ భూమికి సంబంధించిన పత్రాలు, సర్వే నంబర్లు, రిజిస్ట్రేషన్ వివరాలు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రస్తుతం కోట్లాది రూపాయల విలువైన భూమి వ్యవహారంలో కొనుగోలుదారులు తమ పెట్టుబడిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నా, అసలు భూమిపై ఉన్న వివాదానికి మాత్రం ఇంకా పూర్తి పరిష్కారం లభించలేదు.

పంచిపెట్టిన సొమ్ము.. అప్రూవర్‌గా మారే యోచన?

ఈ వ్యవహారంలో అడ్వాన్స్‌గా తీసుకున్న రూ. 50 లక్షల మొత్తంలో సూత్రధారి ఎక్కువ భాగాన్ని స్థానికంగా పలువురికి పంచిపెట్టారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ఇందులో స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుని పేరుతో పాటు ఇద్దరు పోలీసు అధికారులు, మరికొందరి పేర్లు కూడా వినబడుతున్నాయి. అయితే ఇప్పుడు సూత్రధారి ప్లాన్ భగ్నమై డబ్బులు తిరిగి చెల్లిస్తున్న నేపథ్యంలో, పంచిపెట్టిన సొమ్మును సర్దుబాటు చేయడం సదరు వ్యక్తికి కష్టంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో వాటాలు పంచిపెట్టిన వారిని ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. కానీ కొందరు వ్యక్తులు తీసుకున్న మొత్తాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో, ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న సూత్రధారి తనకు సంబంధించిన వివరాలను బయటపెట్టి అప్రూవర్‌గా మారే అవకాశం ఉందన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్నీ అతని స్నేహితుల వద్ద చెప్తూ.. 'ప్రజాజ్యోతి ప్రతినిధి'ని ఆశ్రయిస్తేనే తనకు పరిష్కార మార్గం లభిస్తుందని ఈ అక్రమార్కుడు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

పెద్దల సర్దుబాట్లు ఓకే.. గిరిజన రైతు నష్టపరిహారమేది?

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత కీలకమైన, బాధాకరమైన అంశం గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళికి జరిగిన పంట నష్టం. 2014 నుంచి సుమారు 60 ఎకరాల్లో కౌలుపై జామాయిల్ తోటను సాగు చేసినట్లు మురళి చెబుతున్నాడు. తన శ్రమతో పెంచిన తోటలోని చెట్లను నరికివేయడం వల్ల సుమారు రూ. 70 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొంటున్నాడు. ఇక ఈ వ్యవహారంలో ఒకవైపు వ్యాపారులకు అడ్వాన్స్ సొమ్ము తిరిగి చెల్లించేందుకు చర్చలు, ప్రత్యామ్నాయ భూమి అప్పగింతపై ఒప్పందాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తోంది. కాని తన సాగు, శ్రమతో పెంచిన తోటను కోల్పోయిన కౌలు రైతుకు మాత్రం ఇప్పటికీ పరిహారం అందలేదు. దీంతో అక్రమార్కులకు, వ్యాపారుల పెట్టుబడికి సర్దుబాటు మార్గం కనిపిస్తున్నప్పుడు, రైతు పంట నష్టానికి పరిష్కారం చూపే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది.

పెద్ద సారూ ఎఫ్ ఐఆర్ చేయడం లేదు

రేగళ్ల జామాయిల్ తోట ధ్వంసం ఘటనపై బాధిత గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళి ఆవేదనకు 'ప్రజాజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా పోలీసు వ్యవస్థలో ఒక్కసారిగా చలనం వచ్చింది. ఈ వ్యవహారంలో కొత్తగూడెం డీఎస్పీ సదరు రైతును తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడినట్లు మురళి వెల్లడించాడు. 2014 నుంచి తాను కౌలుపై భూమిని సాగు చేస్తూ తోటను పెంచిన విధానం, చెట్ల నరికివేతతో జరిగిన రూ. 70 లక్షల నష్టాన్ని వివరించగా.. అవతలి వ్యక్తులను కూడా పిలిపించిన డీఎస్పీ రైతుకు అన్యాయం జరిగిందని, సరైన న్యాయం చేయకపోతే సహించేదేది లేదని మొదట తెలిపినట్లు సమాచారం. ఓ సందర్భం లో రెండు రోజులలో దీనిని పెద్ద మనుషుల సమక్షంలో సర్దుబాటు చేసి రైతుకు న్యాయం చేయాలని దసరా పండుగకు ముందే ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఈ ఆదేశాలు వెలువడి వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. దీంతో రైతుకు జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని పెద్ద సారూ స్వయంగా గ్రహించినప్పటికీ, ఈ ఘటనపై చట్టప్రకారం ఎఫ్ఐఆర్ మాత్రం నమోదు చేయకపోవడం గమనార్హం. ఇక బాధితుడికి న్యాయం చేయడంలో ఉన్నతాధికారులు ఎలాంటి తదుపరి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.